సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 109 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 20.08.2025



## ఏఐ ఆధారిత హనుమాన్

మూవీ నిర్మించేందుకు ప్లాన్

4లో



# తెలంగాణ రైతులకు అన్యాయం చేయొద్దు

- తక్షణమే యూరియా కోటా విడుదల చేయండి
- కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి వినతి


**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రైతాంగానికి అవసరం మేరకు యూరియాను తక్షణం సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణపై వివక్ష చూపించొద్దని అన్నారు. కేటాయించిన వాటా మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా చేయకపోవడంతో తలెత్తుతున్న సమస్యలను తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులకు వివరించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు రైతాంగానికి తలెత్తాయని పేర్కొన్నారు. ఈ విషయంలో పార్లమెంట్ సభ్యులు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకి సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. యూరియా సరఫరా విషయంలో సీఎం రేవంత్ స్వయంగా కేంద్ర మంత్రికి వివరించడమే కాకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు దఫాలుగా లేఖలు రాసిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ రాష్ట్ర అవసరాల మేరకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రం వివక్ష చూపుతోందని అన్నారు. రైతుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా ఎంపీలు ఆందోళన సాగిస్తున్నప్పటికీ కోటా మేరకు యూరియా విడుదల చేయకుండా నిర్లక్ష్యంళన ప్రదర్శిస్తున్నారని ఆక్షేపించారు. అవసరమైన మేరకు తక్షణం యూరియా సరఫరా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.



# జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- జలశక్తి అభియాన్‌లో జనగామ ముందంజ
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

2లో



# శభాష్.. స్వామి..

- ఆత్మహత్యకు పూనుకున్న మహిళను కాపాడిన కానిస్టేబుల్
- అభినందించిన సిద్దిపేట సీపీ

2లో

wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.


manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way




# రైతులకు సరిపోను యూరియా అందించాలి : సీపీఎం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని రైతులకు సకాలంలో సరిపోను యూరియా అందించాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైనాయని ఒకరి మీద ఒకరు నెట్టేసుకోవడం తప్ప రైతులకు ఓ రగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. రైతులు కలువు తీసి యూరియా వేసే సమయంలో యూరియా దొరకక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ పనులు మానుకొని రోజుల తరబడి యూరియా కోసం తిరుగుతున్నారని అన్నారు. అది కూడా రైతుకు సరిపోను ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యూరియాతో పాటు షాపు యజమానులు వేరేది రైతులకు ఇప్పుడు అవసరం లేనిది లింకు పెట్టి ఇవ్వడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అలా కాకుండా రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యుడు బద్దిప డగ కృష్ణారెడ్డి, మండల నాయకులు తేలు ఇస్తారి, బక్కెల్లి బాలకిషన్, పుల్లంపల్లి సాయిలు, నీల భిక్ష పతి, మేకల కృపాకర్, తాడూరి భరత్ కుమార్, నూకల శ్రీనివాస్, దాసరి బాలస్వామి, కర్రుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా



**జనగామ, మన చౌరాస్తా :** జల సంరక్షణపై దృష్టి పెట్టడంతో వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించడమే గాక వ్యవసయేతర ఉత్పత్తులపై పట్టు సాధించామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం దేశంలోనే జల శక్తి అభియాన్ కార్యక్రమాలతో ప్రగతి సాధిస్తున్న రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలలోని జిల్లా కలెక్టర్లతో ఢిల్లీ నుంచి నేషనల్ వాటర్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ అర్చన ఆయా జిల్లాల్లో జలశక్తి అభియాన్‌తో ప్రగతిలో దూసుకుపోతున్న అంశాలను కూలంకషంగా చర్చించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని జిల్లాలో జలశక్తి క్రింద చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. జిల్లాలో భూగర్భ జలాలను పెంచేందుకు ఇంటింటికి ఇంకుడు గుంత నినాదంతో ఉద్యమం లా చేపట్టామని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించగలిగామన్నారు. దాంతో 5 మీటర్ల భూగర్భ జలాలు పెరిగాయన్నారు. జిల్లాలో వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత కల్పించగా వరి పంటలో అత్యధికంగా దిగుబడి వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తి తో వరికి ప్రత్యామ్నాయ పంటగా స్థిరాదాయం ఇస్తున్న పామాయిల్ సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 7వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటల సాగు చేపట్టి అనుకున్న లక్ష్యాలను కూడా సాధించ గలిగామని వివరించారు. దేవాదుల ప్రాజెక్ట్ నీటితో రిజర్వాయర్లు, చెరువులు మరమ్మతులు చేపట్టి నింపడం జరిగిందని, మత్స్యకారులు గత రెండు సంవత్సరాలుగా చేపల పెంపకంతో పాటు మార్కెటింగ్ చేపట్టి సుమారు 300 నుంచి రూ.350 కోట్ల వ్యాపారంతో సాధికారత దిశగా కొనసాగుతున్నట్లు వివరించారు. అంతేగాక గ్రామాలలో నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు నిర్వహణతో వనమహోత్సవం కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ జనగామ చిన్న జిల్లా అయినా అన్ని రంగాలలో పురోగాభివృద్ధి సాధిస్తూ అభివృద్ధి పథంలో కొనసాగడంతో జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



# శభాష్.. స్వామి..

## మహిళను కాపాడిన కానిస్టేబుల్

**చేర్యాల, మన చౌరాస్తా :** చెరువులోకి దూకి ఆత్మ యత్నానికి యత్నించిన మహిళను కానిస్టేబుల్ ప్రాణాలకు తెగించి కాపాడిన ఘటన చేర్యాల పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద మంగళవారం ఉదయం చోటు చేసుకొంది. స్థానికుల కథనం ప్రకారం పట్టణ కేంద్రానికి చెందిన పాక రాణి (24 ) కుటుంబ కలహాలతో చెరువులోకి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. నీటిలో పూర్తిగా మునిగిపోతున్న సమయంలో చెరువు కట్టపై వాకింగ్ వెళ్తున్న స్వామి కానిస్టేబుల్ గమనించాడు. వెంటనే చెరువులోకి దూకి మహిళను ప్రాణాలతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. ప్రాణాలకు తెగించి మహిళను ప్రాణాలతో కాపాడిన కానిస్టేబుల్ స్వామిని పోలీస్ కమిషనర్ బి.అనురాధ, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నవీన్ తో పాటు పలువురు అభినందించారు.





# బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని వినతి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని నెహ్రూ పార్క్ నుంచి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వరకు రైల్వే క్రాసింగ్ మీదుగా నిర్మించిన బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి హజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు మంగ బీరయ్య, జిల్లా కార్యాలయ కార్యదర్శి బంద సౌందర్య, నాయకులు గాజుల నాగరాజు తదితరులు ఉన్నారు.

# ఎరువుల కోసం ఆందోళన వద్దు

- కావాల్సిన యూరియా ఉంది
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**నర్మెట, మన చౌరాస్తా :** ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని, జిల్లాకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. మంగళవారం నర్మెట్ట మండల కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అంబిక సోనీ, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్. కరుణాకర్‌తో కలిసి తనిఖీ చేశారు. మండలంలోని పీఏసీఎస్, ఆగ్రోస్, ఓపీ సీఎంఎస్ కేంద్రాలను సందర్శించారు. విక్రయ దారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టాకు నమోదును అధికారులతో కలిసి పరిశీలించారు. ఎరువుల రైతులతో మాట్లాడారు. ఎరువుల గురించి ఆందోళన చెందరాదని సమృద్ధిగా నిలువలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు ఒకటి, లేదా రెండు బస్తాలు అవసరాలను బట్టి కొనుగోలు చేయాలన్నారు. యూరియాను కొనుగోలు చేసేటప్పుడు రైతులు భూమి వివరాలు ఆధార్ కార్డును పరిశీలించి ఇవ్వవలసిందిగా వ్యాపారస్తులకు సూచించారు. మండలంలో ఇప్పటివరకు 850 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అనంతరం అదే మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి నిర్వాహణ తీరును పరిశీలించారు.

# వీరభద్రుడికి మహాభిషేకం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని చివరి మంగళవారం స్వామివారికి కవచాలు తొలగించి మహాన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. 27 రోజులు నిష్ఠగా ఉండే స్వాములు మంగళవారం ఏకాదశి కూడా కలిసి రావడం స్వాములు అందరూ స్వామికి అభిషేకం చేసిన తర్వాత ఉపవాస దీక్ష చేపట్టి స్వామిని స్మరించుకున్నారు. కార్యక్రమం గురుస్వామి రాంబాబు, ఈవో కిషనరావు, భక్తులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ

బచ్చనపేట, మన చౌరాస్తా : జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల బచ్చన్నపేటలో పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.40 వేలు విలువైన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రైల్వే డిపార్ట్మెంట్‌కు చెందిన కోడూరు శ్రీనివాస చారి , రిటైర్డ్ టీచర్ దాసారం బాలయ్య, రేషన్ డీలర్ కొత్తపల్లి రాజమౌళి, హైదరాబాద్ వాస్తవ్యులు కండ్లకుంట అనంత చార్యులు తాము చదువుకున్న పాఠశాలపై అభిమానంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి జీవితం లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తాము చదువుకున్న పాఠశాలకు, తమ తల్లితండ్రులకు, గ్రామానికి మంచి పేరు ను తీసుకవచ్చి, దేశ నిర్మాణంలో కీలకపాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీసీ చైర్ పర్సన్ లత, స్టాఫ్ సెక్రటరి లక్ష్మీనర్సమ్మ, పీడీ జ్యోతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.








# ఎల్లమ్మ తల్లికి విశేషాలంకరణ



జనగామ, మన చౌరాస్తా : జనగామ పట్టణంలోని బాలాజీ నగర్ శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయంలో శ్రావణమాసం ప్రతి మంగళవారం అమ్మవారు భిన్న రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనమిస్తున్నారు. చివరి మంగళవారం సందర్భంగా అమ్మవారికి 61 రకాల చీరలతో విశేషాలంకరణ చేశారు. శ్రావణమాసంలో అమ్మవారిని చీరలతో అలంకరించడం సాంప్రదాయమైన ఆధ్యాత్మిక ఆచారం. ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. దీపకాంతుల మధ్య దివ్యంగా వెలిగిన అమ్మవారిని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.




# శ్రీకృష్ణుడి పల్లకీ ఊరేగింపు

జనగామ టౌన్, మన చౌరాస్తా : శ్రీశ్రీశ్రీ భగవాన్ స్వామి ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరా వారి దివ్య ఆశీస్సులతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జనగామ జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీలో ఘనంగా కొనసాగాయి. ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామివారి పల్లకీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భజనమండళులు, చిన్నారుల కృష్ణ వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చేర్యాల, భువనగిరి, జనగామ కమిటీ అధ్యక్షులు పంచాక్షరి, దేవేంద్ర, శ్రీనాథ్, ఉపేందర్, లింగస్వామి, యాదగిరి, మెరుగు రామరాజు, ఎదునూరి రాజు, లావణ్య, శ్రీవాత్సవ్, శ్రీవిద్య, రమాదేవి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.



# అసాంఘిక కార్యక్రమాల అడ్డాగా ఇండోర్ స్టేడియం

ఆదిలాబాద్, మన చౌరాస్తా : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. బిల్డింగ్ అసంపూర్ణంగా ఉండడంతో మందు బాబులకు అడ్డాగా మారింది. ఎక్కడు చూసిన మద్యం, బీరు సీసాలు కనిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని, ఇండోర్ స్టేడియంను వాడుకలోకి తీసుకుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





## ఘనంగా ఫొటోగ్రఫీ డే

జనగామలో జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాము, కృష్ణ, మోహన్, అబ్దుల్లా, వెంకటేశ్వర్లు, చంద్ర ప్రకాష్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. - మన చౌరాస్తా, జనగామ



# గ్రామాల్లో అభిప్రాయ సేకరణ

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మంత్రి ఓఎస్ డి.శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో రెండు రోజుల పాటు ప్రతి గ్రామాన ప్రజల అభిప్రాయ సేకరణ, సమస్యల పరిష్కారం, అభివృద్ధి అంశాల పట్ల చర్చ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రత్నగిరి, రంగయ్యపల్లి, మాణిక్య పూర్, గాంధీనగర్, కొప్పూర్, భీమదేవరపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ప్రజల దగ్గర నుంచి వినతులు స్వీకరించారు. గ్రామ ప్రత్యేక అధికారులు మండల స్థాయి అధికారులతో కూడుకున్న బృందం ప్రతి గ్రామంలో సామాజిక శాఖకు సంబంధించిన సమస్యలు చేయాల్సిన పనులపైన అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు అయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భజరంగ్ ప్రసాద్‌కు మరో అవార్డు

నల్లగొండ, మన చౌరాస్తా : నల్లగొండ సాక్షి ఫొటో గ్రాఫర్కు భజరంగ్ ప్రసాద్ మరో అవార్డు దక్కింది. ఫొటోగ్రఫీ డే సందర్భంగా డాక్టర్ భగవాన్ దాస్, బండి రాజన్ బాబు జ్ఞాపకార్థం ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఏపీ ఫొటోగ్రఫీ అకాడమి అనుబంధం గా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలో సబ్జెక్ట్, కంపోసిషన్, టెక్నికల్, లైటింగ్ అంశముల ప్రాతిపదికగా నల్లగొండకు చెందిన సాక్షి సీరియల్ ఫొటో జర్నలిస్టు భజరంగ్కు ఉత్తమ ఛాయాచిత్రం అవార్డుకు దక్కింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమి కార్యదర్శి, ఫొటో జనిక్ ఆర్ట్ సర్కిల్ ఫౌండర్ కానాల సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.








# ఏఐ ఆధారిత
# హనుమాన్

ఇప్పుడంతా పురాణాల కాలం నడుస్తోంది. పురాణాల ఆధారంగా చిత్రాలకు ఆదరణ పెరుగుతోంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం బాగా పెరుగుతోంది. -టెక్నాలజీ రంగం నుంచి హెల్త్, ఎడ్యుకేషన్, బిజినెస్, ఎంటర్‌టెయిన్‌మెంట్ తో పాటు-.. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో ఏఐకి డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోంది. కథలు రాయడం నుంచి విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ సన్నివేశాల వరకు ఏఐ ద్వారా సులభతరం అవుతుంది. ఇప్పటికే కొన్ని షార్ట్ ఫిల్మ్స్, యానిమేటెడ్ క్లిప్స్ మాత్రమే ప్రేక్షకుల ముందుకు రాగా, ఇప్పుడు బాలీవుడ్ నుంచి ఒక భారీ పూర్తి స్థాయి ఏఐ సినిమా రాబోతోందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం 'చిరంజీవి హనుమాన్'. పురాణాల్లో అత్యంత శక్తివంతమైన దేవుడిగా, భక్తుడిగా పేరుగాంచిన హనుమంతుని శౌర్యం, భక్తి, అద్భుత గాథను ఏఐ ఆధారిత యానిమేషన్ శైలిలో చూపించబోతున్నారు. ఇది సాధారణ మిథాలజీ సినిమా కాదు, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన స్పెషల్ ప్రాజెక్ట్. హనుమంతుని ధైర్యం, భక్తి, సాహసాలను ఇప్పటివరకు స్క్రీన్‌పై చూడని విధంగా చూపించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ని ప్రారంభించారట. ఈ ప్రాజెక్ట్‌ని బాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు విక్రమ్ మల్హోత్రా, విజయ్ సుబ్రహ్మణ్యం సంయుక్తంగా నిర్మిస్తుండగా, విజువల్స్, గ్రాఫిక్స్, యాక్షన్ సన్నివేశాలను.. అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్లతో కలసి, ఏఐ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి, హనుమంతుని వ్యక్తిత్వాన్ని కొత్త కోణంలో చూపించబోతున్నారని టీమ్ వెల్లడిరచింది. ఇందులో భాగంగా ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. అంతే కాదు ఈ చిత్రం వచ్చే ఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కానుంది.



